క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం

మోతడక(తాడికొండ): విద్యార్థి దశలో సేవా భావాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత విలువలు పెంపొందించుకొనేందుకు ఎంతాగానో దోహదం చేస్తుందని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ అన్నారు. కళాశాల సీఎస్ఈ– ఏఐ అండ్ ఏఐఎంఎల్ విభాగానికి చెందిన సిటి టెక్నోస్పార్క్స్ అసోసియేషన్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఆదివారం అనాథలు, వికలాంగులకు ఆహారం పంపిణీ చేశారు. గుంటూరులోని ప్రభుత్వాస్పత్రి, మార్కెట్ సెంటర్, బస్టాండ్ పలు ప్రాంతాలలో సంచరించే వృద్ధులు, అనాథలకు అందించారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, ఏఐ అండ్ ఏఐఎంఎల్ విభాగాధిపతి ఎస్.శాంతి ప్రియ అభినందించారు.

కూచిపూడి నృత్య కళాకారులకు సన్మానం



మంగళగిరి: పట్టణంలోని శ్రీ నటరాజ నృత్యాలయం వ్యవస్థాపకురాలు బట్టు తిరుమల కళ్యాణి తన శిష్య బృందంతో డిసెంబర్ 24 వ తేదీన హైదరాబాద్‌లోని భారత్ అకాడమిలో జరిగిన కూచిపూడి కళా వైభవం, మహా బృందవైభవంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ నమోదు కావడంతో ఆదివారం వడ్లపూడి సెంటర్‌లోని రామనాథం చినకోటయ్య, శివపార్వతమ్మల వృద్ధాశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి పాల్గొని నృత్యకారులను తిరుమల కళ్యాణిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామనాథం సాంబశివరావు, దీపాల సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



తాడికొండ: విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలి గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ సూచించారు. తాడికొండ బీఎస్ఎస్‌బీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా జీవితంలో వెలుగులు నింపుకోవచ్చని, నేటి ఆధునిక జీవన విధానంలో యువత పెడదారిన పడుతూ జీవితాలను అంధకారమయం చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి ఆవరణ శుభ్రం చేసి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎం.వేణుబాబు పాల్గొన్నారు.

నేడు పసుపు రైతుల సదస్సు

మంగళగిరి: కోల్డ్ స్టోరేజ్ బాధిత పసుపు రైతుల సదస్సు సోమవారం దుగ్గిరాలలో నిర్వహించనున్నట్లు సీపీఐ నాయకులు అజయ్‌కుమార్ చిన్న తిరుపతయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర పసుపు రైతు సంఘం, రైతు సంఘం సమితి, సీపీఐ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో రైతులంతా పాల్గొనాలని కోరారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



కాపా సుబ్బారావు మృతదేహం

మంగళగిరి: నగర పరిధిలోని కాజ(వెంకటరెడ్డి పాలెం) జాతీయ రహదారిపై కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకటరెడ్డి పాలెంకు చెందిన కాపా సుబ్బారావు(70) ఆదివారం రోడ్డు దాటుతుండగా గుంటూరు నుంచి విజయవాడ వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఫిరంగిపురం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో ఎస్టీయూ గుంటూరు జిల్లా శాఖ వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జోసఫ్ సుధీర్‌బాబు, డి.పెదబాబు, ఏవీ ప్రసాద్‌బాబు, శ్యామ్‌బాబు, డీవీ సుబ్బారావు, ప్రకాశరావు, ఎం.వెంకటేశ్వర్లు, పి.త్యాగరాజు, ఏడుకొండలు, వెంకటరెడ్డి, డికే.సుబ్బారెడ్డి, భరత్‌వ్యాస్, శారద, వెంకట్రావు, టి.భాస్కర్, పి.ప్రసాద్, ఆర్.రాజశేఖర్, ఎం.శ్రీను, సాంబశివరావు, సుందరరావు, జి.జోజప్ప, పి.జోజిలు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన వైఎస్ జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- తక్కెళ్లపాడులో సచివాలయం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, బ్రహ్మానందరెడ్డి

ఫిరంగిపురం: ప్రజల వద్దకే పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి మేకతోటి సుచరిత అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో నూతనంగా రూ.60 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఆదివారం కత్తెర హెనీ క్రిస్టినాతో కలసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం చేసిన తరువాత పాలన వ్యవస్థలో పెద్ద మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తమ పనుల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రతి గ్రామంలో సచివాలయాలు ఏర్పాటు చేసి అందులో ప్రజలకు అవసరమయ్యే 500 రకాల సేవలు అందిస్తున్నారని చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా పరీక్షలు చేయడమే కాకుండా మందులు అందిస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఉచితంగా ఏర్పాటు చేసి పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారని చెప్పారు. తక్కెళ్లపాడు గ్రామానికి ప్రభుత్వానికి 25కోట్ల రూపాయలు పలు పథకాల ద్వారా ప్రజలకు అందాయన్నారు. కార్యక్రమానికి ముందుగా గురుడాచలపాలెం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ఊరేగిస్తు సచివాలయం వద్దకు తీసుకువచ్చారు. గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని అంకాలమ్మ, వీరాంజనేయ స్వామి ఆలయాల వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆలయాలవద్ద అర్చకులు లక్ష్మీనారాయణశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, ప్రభుత్వం సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచి ఎం.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు ఎం.విజయలక్ష్మి, జి.చంద్రం, కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, ఎం.ఈశ్వరరెడ్డి, ఇ.శ్రీనివాసరెడ్డి, బి.అంజిరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పి.మరియబాబు, ఎస్.నాగరాజు, డి.మెల్కియా, వి.వీరయ్య, జి.నాగలక్ష్మి, జి.మస్తాన్‌వలి, పి.చిన్న, కె.అప్పిరెడ్డి, సంజీవరెడ్డి, జి.చౌడయ్య, ఎస్‌కే ఖాజావలి, సీహెచ్ శాంతమ్మ, కె.శ్రీనివాసరెడ్డి, టి.కృష్ణ, పి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

మానవ సేవా సంస్థ సేవలు అభినందనీయం



ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్సీ మురుగుడు

నిడమర్రు(మంగళగిరి): పేదలకు ఉచిత వైద్య సేవలందించడంలో మానవ సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, పార్టీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, రూరల్ పార్టీ కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. నగర పరిధిలోని నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్య సేవలందిస్తున్నారన్నారు. 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాప అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్, డాక్టర్లు వేణుగోపాల్ రెడ్డి, ప్రసాద్, శశిధర్, అనూష, ప్రత్యూష, అరుణ్ కుమార్, వినోద్, స్థానిక పార్టీ నాయకులు గాదె లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, శేషిరెడ్డి, రమేష్, రవికుమార్, సుధాకర్, శ్రీను, వెంకటాద్రి, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నగర పరిధిలోని జాతీయ రహదారి వెంట ఉన్న ఆర్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి హాజరవుతారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టి కృషి

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త చిరంజీవి



మురుగుడు హనుమంతరావు, గంజి చిరంజీవిని సత్కరిస్తున్న కొల్లి గిరి తదితరులు

మంగళగిరి: రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి పిలుపునిచ్చారు. ఆదివారం జాతీయ రహదారి వెంట ఉన్న ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో కొల్లి గిరిధర్ నాయకత్వంలో పలువురు నాయకులు కార్యకర్తలు హనుమంతరావు, చిరంజీవిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాయన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి రానున్న ఎన్నికలలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గానికి బీసీ అయిన గంజి చిరంజీవిని సమన్వయకర్తగా నియమించిన నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మెజార్టీతో చిరంజీవిని గెలిపించాలన్నారు. బీసీ అత్యధికంగా ఉన్న మంగళగిరిలో టీడీపీ బీసీలకు టికెట్ ఇవ్వకుండా మోసం చేస్తోందని ఆరోపించారు.

దేవుడికి అమ్మపై కనికరం లేదు..

- రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి
- గతంలో పెద్దకొడుకు..
- చివరిచూపునకు నోచుకోలేని స్థితిలో తల్లి



మృతి చెందిన క్రాంతి కుమార్

తాడేపల్లిరూరల్: అమ్మ.. ఆశల సౌధం కుప్పకూలింది. అల్లరి ముద్దుగా పెంచుకున్న కొడుకుని మృత్యువు కబళించింది. కొంతం కాలం కిందటే పెద్ద కొడుకు చనిపోయాడు. అమ్మకు ఉద్యోగం రాగా చేరే లోపే పక్షవాతానికి గురైంది. దీంతో ప్రభుత్వం మానవతా దృక్పథంతో చిన్న కొడుకు తాత్కాలిక ఉద్యోగం ఇచ్చి అవకాశం ఇచ్చింది. అయితే పది రోజుల కిందట విధులకు హాజరైన వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కొడుకు కళ్లారా చూసుకునే అదృష్టం ఆ తల్లికి లేకుండపోయింది. వివరాలు...తాడేపల్లి ఒకటో వార్డులో నివాసముండే కొమరబత్తిన చంద్రబాబు, సబితా రాణి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 19 సంవత్సరాల వయస్సు ఉన్న పెద్ద కొడుకు శ్రీకాంత్ తెల్లవారుజామున విడుదలైన కొత్త సినిమాకు స్నేహితులతో కలసి వెళ్తుండగా కుంచనపల్లి అండర్ పాస్ వద్ద మద్యంమత్తులో ఉన్న కొంతమంది అడ్డుకుని విచక్షణా రహితంగా కొట్టడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం తల్లి సబితరాణికి ప్రభుత్వం ఆరు నెలల కింద పెద కాకాని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్ పోస్ట్ ఇచ్చారు. డ్యూటీలో జాయిన్ అవ్వాల్సిన రోజు సబితారాణికి పక్షవాతం వచ్చింది. ఆ విషయం ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో తాత్కాలికంగా ఆమె రెండో కుమారుడైన క్రాంతికుమార్(25)ను నియమించారు. విధులు నిర్వహించుకుని అర్ధరాత్రి సమయంలో ఇంటికి వస్తుండగా తాడేపల్లి బైపాస్‌రోడ్ నుంచి బకింగ్‌హామ్ కెనాల్‌కు వచ్చే రహదారిలో డివైడర్‌కు గుద్దుకుని ఈ నెల 19వ తేదీన తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ తల్లిదండ్రులు తల్లడిపోతున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

మంగళగిరి: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాటాడుతున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.17,300 నగదు, 4 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆధునిక వైద్యంతో అమ్మతనం



కాకుమానుకు చెందిన సరోజ, శ్రీకాంత్ దంపతులకు ఏడేళ్ల కిందట వివాహమైంది. పిల్లలు పుట్టకపోవడంతో ఆందోళనలో పడిపోయారు. బంధువుల ఇళ్లలో శుభకార్యాలకు కూడా హాజరుకాకుండా దూరంగా ఉండి పోయారు. ఒకానొక దశలో వారు ఆత్మహత్యాయత్నం సైతం చేశారు. నేడు ఎంతోమంది ఇలాంటి జంటలు ఆధునిక చికిత్సా పద్ధతులతో సంతానం పొందవచ్చని తెలియక ఇబ్బంది పడుతున్నారు. సంతానం లేకపోవడానికి గలకారణాలు, ఎలాంటి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయో వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న సమస్యలు
- అమ్మతనానికి పలువురు దూరం
- ఆధునిక వైద్యసేవలతో మాతృత్వం

గుంటూరు మెడికల్: వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగక బాధపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అమ్మ అనే పిలుపు కోసం మహిళలు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. అలాంటి వారికి నేడు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో సులువుగా చాలా మంది సంతానం పొందుతున్నారు. గుంటూరులో సంతానం లేని వారికి వైద్యసేవల్ని అందించేందుకు ప్రత్యేక ఆస్పత్రులు, ఐవీఎఫ్ సెంటర్స్ ఉన్నాయి. వాటిల్లో చికిత్స పొందిన ఎందరో దంపతులు నేడు సంతానం పొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలు పుట్టకపోవడానికి మహిళల్లో కారణాలు

- పెళ్లయిన ఏడాది పాటు ఎలాంటి గర్భనిరోధక పద్ధతులు పాటించకుండా దాంపత్య జీవితాన్ని కొనసాగించినా గర్భం రాకపోవడాన్ని వంధ్యత్వం(ఇన్‌ఫెర్టిలిటీ) అంటారు.
- అండం విడుదల అవ్వకపోవడం
- హార్మోన్ల సమస్య,
- గర్భసంచి, కడుపులో ఇన్‌ఫెక్షన్లు
- గర్భసంచి ట్యూబ్‌లు మూసుకుపోవడం
- పీసీఓడీ, జునైటైల్ టీబీ, అలవాట్లు,
- అధిక మానసిక ఒత్తిడి, అధిక బరువు
- అండం విడుదల జరిగే సమయంలో దాంపత్యంలో పాల్గొనకపోవడం
- మూఢనమ్మకాలు
- సెక్స్‌పై ఆసక్తి, అవగాహన లేకపోవడం

మగవారిలో...

- సుఖవ్యాధులు, టీబీ
- స్మోకింగ్, మద్యం, మత్తుపదార్థాల వినియోగం,
- బీర్జాలకు గాయాలు, దెబ్బలు తగలడం
- అంగం సైజుల్లో తేడాలు
- పని ఒత్తిడి,
- కంప్యూటర్‌ను 6 నుంచి 8 గంటల పాటు వినియోగించడం
- రాత్రివేళల్లో ఎక్కువగా సెల్‌ఫోన్ మాట్లాడటం
- వీర్యకణాలు తక్కువగా ఉండటం
- రాత్రివేళలో నిద్రపోకుండా ఉండటం
- హార్మోన్ సమస్యలు,
- గర్భనిరోధక సాధనాలు ఎక్కువగా వాడటం.

అత్యాధునిక వైద్య పద్ధతులు

- సంతానం కోసం చింతించే వారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కోసం ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్(ఐవిఎఫ్) విధానంలో భార్య అండాన్ని, భర్త శుక్రకణాల్ని ఇంక్యుబేటర్‌లో పెట్టి రెండు నుంచి ఐదు రోజుల్లో పిండం తయారయ్యాక ఇంజక్షన్ రూపంలో భార్య గర్భంలో పిండాన్ని పెడతారు. ఈ విధానంలో 30 నుంచి 40శాతం పిల్లలు పుట్టే అవకాశాలు ఉంటాయి.
- భర్త శుక్రకణాల సంఖ్య తక్కవగా ఉంటే ఇక్సీ విధానం ద్వారా, సంఖ్య జీరో అయితే టీసా పద్ధతి ద్వారా బీర్జాల్లో నుంచి సిరంజి ద్వారా వీర్యకణాలు తీసి ఫలదీకరణం చెందించి పిండాన్ని తయారు చేసి గర్భంలో పెడతారు. ఈ విధానంలో 30 నుంచి 40శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది.
- ఇంట్రాయుటైన్ ఇన్‌సెమినేషన్(ఐయుఐ) విధానంలో భర్త శుక్రకణాలు తీసి ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో ప్రవేశపెడతారు. ఈ విధానంలో 10 నుంచి 20శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది.



- భార్య గర్భసంచి పిండం మోసే స్థితిలో లేకపోయినా, ఆమె ఆరోగ్యరీత్యా గర్భం రాకూడదని వైద్యులు నిర్ధారిస్తే సరోగసి ద్వారా(అద్దె గర్భం) సంతానం పొందవచ్చు. ఈ విధానంలో 30 నుంచి 40శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది.
- అండం విడుదల కాని సందర్భాల్లో, పురుష కణాలు తక్కువగా ఉన్న సమయాల్లో మందుల ద్వారా సమస్యను నివారించి పిల్లలు పుట్టే విధంగా చేస్తున్నారు. ఈ విధానంలో 5 నుంచి 10శాతం పిల్లలు పుట్టే అ వకాశం ఉంది.

అందుబాటులో అత్యాధునిక వైద్య పద్ధతులు



సంతాన లేమితో బాధపడే వారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య కరమైన పిల్లలు పుట్టేందుకు 23 ఏళ్ల నుంచి 28 ఏళ్ల వయస్సు చాలా అనుకూలం. గర్భం దాల్చేందుకు ముందుగానే ఫోలిక్ యాసిడ్ మింగడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

– డాక్టర్ షమా సుల్తానా, ఐవీఎఫ్ నిపుణురాలు, గుంటూరు

వైద్య పరీక్షలన్నీ చేయించాలి



గర్భం దాల్చిన 13 వారాలలోపు న్యూకల్ ట్రాన్స్‌ల్యూసెన్సీ (ఎన్‌టీ) స్కాన్ చేయించాలి. డబుల్‌మార్కర్ టెస్ట్, క్రోమోజోన్ ఎనాలసిస్ టెస్ట్, షుగర్ టెస్ట్, రక్తహీనత టెస్ట్ చేయించాలి. 18 వారాల నుంచి ఐరన్, ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రలు, మూడు, ఐదు నెలల్లో టీటీ ఇంజెక్షన్లు చేయించాలి. గర్భం దాల్చిన 20 నుంచి 22 వారాల్లోగా టీఫా స్కాన్ పరీక్ష చేయిస్తే గర్భంలో ఉండే బిడ్డ గుండె, తల, శరీరం, ఎముకల్లో ఎదుగుదల లోపాలను తెలుసుకోవచ్చు. 24 వారాల తరువాత బీపీ, షుగర్ పరీక్షలు చేయించాలి. 32 వారాలకు ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ , పెట్ స్కానింగ్, సీటీజీ స్కాన్ చేయించాలి.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ,ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు

బాధితులు అధికం



వందలో సుమారు 30శాతం సంతాన లేమి సమస్యలతో బాధపడుతున్నారు. ఉమ్మడి గుంటూరులో 200 మంది గైనకాలజీ వైద్యులు, ఆరు ఐవీఎఫ్ స్పెషాలిటీ సెంటర్స్ ఉన్నాయి. ప్రతినెలా వీరి వద్దకు వెయ్యి నుంచి 1500 జంటలు సంతానం కోసం చికిత్స కోసం వస్తున్నారు. సంతాన సమస్యలతో బాధపడేవారికి ఆధునిక వైద్య పద్ధతులు నేడు చాలా అందుబాటులోకి వచ్చాయి. వైద్యుల సలహాలు పాటిస్తూ, క్రమం తప్పకుండా మందులు వాడి ఫెర్టిలిటీ సెంటర్స్‌కు వెళ్లిన ఎందరో దంపతులు సంతానం పొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్, గుంటూరు

నేడు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యవర్గ నిర్ణయం మేరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. నరసింహారెడ్డి, కె.కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లంతా పాల్గొనాలని వారు కోరారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పట్నంబజారు: మహిళ అదృశ్యంపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉండే రావి రమ చీటీ పాటలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ క్రమంలో నష్టాలు రావడంతో గుంటూరు ఏటీ అగ్రహారంలోని శ్వేత ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కుమార్తె రావి సాహితి దగ్గరకు కొద్ది రోజుల కిందట వచ్చారు. ఈ నెల 21న రమను సాహితి తిరిగి ఊరు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లో దింపి వెళ్లిపోయారు. అనంతరం కొద్దిసేపటి తరువాత రైలు ఎక్కిందా.. లేదా ? అని తెలుసుకునేందుకు సాహితి తల్లికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల నివాసాల్లో అడిగినప్పటికీ రాలేదని తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను దూషించిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో సివిల్ కాంట్రాక్టర్ ఇంటికి వెళ్లి ఇద్దరు వ్యక్తులు మహిళలను దూషించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కె.మహేశ్వరరెడ్డి సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రశాంత్, అతని తండ్రి వెంకటేశ్వర్లు మహేశ్వరరెడ్డి వద్ద లేబర్ వర్క్ చేశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య లావాదేవీల విషయంలో గొడవ జరిగింది. ప్రశాంత్, వెంకటేశ్వర్లు మహేశ్వరరెడ్డికి ఫోన్ చేసి దుర్భాషలాడారు. పైగా మహేశ్వరరెడ్డి ఇంటికి వెళ్లి మహిళలను అసభ్యకరంగా దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 'తెలుగు కావ్య మథనం' వార్షికోత్సవం



పూసపాటి దంపతులకు సత్కారం

పాత గుంటూరు: బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయం వేదికగా ఆదివారం తెలుగు కావ్య మథనం సంస్థ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. సభకు సంస్థ వ్యవస్థాపకులు పూసపాటి కృష్ణ సూర్యకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. తెలుగు పద్యంపై అభిమానంతో 2019 నుంచి వాట్సాప్ గ్రూప్ ద్వారా అనేక మంది తెలుగు ఉపాధ్యాయులకు పద్యాల్ని ఉచితంగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. పద్య రచనను క్రమబద్ధంగా నేర్పించడమే లక్ష్యం అన్నారు. అతిథులు ఏ భానుప్రకాష్, ఎన్.సీహెచ్. చక్రవర్తి, చిటితోటి విజయకుమార్, కంది శంకరయ్య ప్రసంగించారు. జయకర్ విశ్వేశ్వర్ కావ్య మథన సమూహ పరిచయం చేశారు. కంది శంకరయ్యకు సమస్యేంద్ర జాలిక బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పూసపాటి దంపతులను విద్యార్థులు, గురువులు ఘనంగా సత్కరించారు. ఘనమైన తెలుగు పద్యం కనుమరుగు కాకూడదనే ఉచితంగా బోధన చేస్తున్నట్లు పూసపాటి దంపతులు తెలిపారు.

లైబ్రరియన్స్‌కి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించాలి

నెహ్రూనగర్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న పీడీ, లైబ్రేరియన్స్‌కు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని ఇంటర్ ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ నాయకులు, లైబ్రేరి సైన్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్‌బాబు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీ, లైబ్రేరియన్స్‌కు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ 2021లో జీవో నం.76ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. దాన్ని అమలు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవోను అమలు చేయాలని ఆయన కోరారు.